క్లుప్తంగా

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరంలోని స్వయంభూ దాసాంజనేయస్వామి దేవాలయంలో మాఘమాసం శనివారం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఈ కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి పర్యవేక్షించారు.

మేరీమాత ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): గుణదలలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే మేరీ మాత ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శనివారం నగర పర్యటనలో భాగంగా ఆయన బెత్లెహేమ్ నగర్, ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకూడదని, అందుబాటులో నిత్యం తాగునీరు అందించాలని, ఉత్సవాలు జరిగే ప్రాంగణమంతా నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ జరగాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ భక్తులకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్ వర్క్స్ పి.సత్యనారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఏసుపాదం పాల్గొన్నారు.

భారతీయ సనాతన ధర్మశిల్పి ఆదిశంకరులు



విజయవాడ కల్చరల్: భారతీయ సనాతన ధర్మశిల్పి ఆది శంకరులని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ వర్ధంతి సందర్భంగా శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆదేశంతో 75 రోజులపాటు శివరామకృష్ణక్షేత్రంలో నిర్వహిస్తున్న నవచండీ హోమం, చండీపారాయణ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శనివారం సామవేదం శంకర విజయంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ జగద్గురువులు గ్రంథాలను నిత్యం పఠించాలని సూచించారు. శంకరుల బోధనలు సదా స్మరణీయమని తెలిపారు. అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రధర్మాధికారి హనుమత్ ప్రసాద్, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి రామరావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సామవేదం.. జగద్గురువుల విగ్రహానికి పూజలు చేశారు.

పెన్షన్ల పంపిణీ త్వరగా పూర్తి చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): వీఎంసీ పరిధిలో పెన్షన్ల పంపిణీలను సత్వరమే పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ రోడ్డు తదితర వీధుల్లో శనివారం ఆయన పర్యటించారు. పెన్షన్ లబ్ధిదారుల ఆధార్ కార్డును రియల్ టైం బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టం యాప్‌లో పరిశీలించి పెన్షన్ నగదు అందజేశారు. వారితో మాట్లాడి ప్రతి నెలా సరైన సమయానికి పెన్షన్ అందుతుందా లేదా, ఎంత పెన్షన్ అందుతుంది వంటి విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఇంజినీరింగ్ సిబ్బంది చేస్తున్న తాగునీటి పరీక్షను, క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ప్రతిరోజు జరుగుతున్న తాగునీటి పరీక్షను అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలకు నిత్యం పరిశుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తమ పర్యటనలో ఎప్పటికప్పుడు డ్రైన్ క్రాసింగ్‌ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి కిచెన్ శుభ్రత, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లత, సూపరింటెండింగ్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను పట్టించుకోరే..!

- రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రి, వాహనాల మరమ్మతులు
- వాహన చోదకులకు అవస్థలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు



డాబా కొట్లు సెంటర్‌లో రోడ్లపైనే వాహనాల మరమ్మతులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): అడుగడుగునా ఆక్రమణలతో అజిత్‌సింగ్‌నగర్, డాబా కొట్లు సెంటర్ కుచించుకుపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఆక్రమణలే కనిపిస్తాయి. దీంతో సిటీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సింగ్‌నగర్ పెట్రోలు బంకు నుంచి వాంబే కాలనీ వరకు రోడ్డుకిరువైపులా రోజురోజుకి ఆక్రమణలు పెరిగిపోతున్నా, కార్పొరేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

వాహనాలు బయటకు తీయాలంటే అవస్థలే

ఈ ప్రాంతంలో రోడ్లపైనే రోజుల తరబడి భవన నిర్మాణ సామగ్రిని ఉంచేస్తున్నారు. స్థానికులు రాకపోకలు సాగించాలన్నా, తమ వాహనాలను బయటకు తీయాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి రోడ్లపైనే ప్రయాణించాల్సి వస్తోంది. సిమెంటు, ఇసుక, ఇటుక రాళ్లు, ఐరన్ రాడ్లు రోడ్లపైనే నెలల తరబడి ఉంచడంతో అనేక అవస్థలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. డాబా కొట్లు సెంటర్‌లో ఏ వీధి చూసినా వాహనాల మరమ్మతు షాపుల యజమానులు రోడ్డును ఆక్రమించుకుని రిపేర్లు చేస్తుండటంతో ఆ ప్రాంతం ఆయిల్‌తో నిండిపోయి ఆ మార్గంలో వాహనాలు జారి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా లూనా సెంటర్, గంగానమ్మ గుడి రోడ్లలో సమస్య తీవ్రంగా ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు.



రోజుల తరబడి రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రి

బస్సులు నిలిపే చోటు లేదు

డాబా కొట్లు సెంటర్, గంగానమ్మగుడి తదితర ప్రాంతాల్లో సిటీ బస్సులు నిలపడానికి అవకాశం లేకుండా రోడ్లను ఆక్రమించుకున్నారు. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కే అవకాశం లేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు.

స్పందించని అధికారులు

ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోడంపై స్థానికులు పలు సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వారికి అందుతున్న మామూళ్లు దీనికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డాబాకొట్లు సెంటర్‌లో నడవాలంటేనే ఇబ్బందే



నిత్యం రద్దీగా ఉండే డాబా కొట్లు సెంటర్‌లో ఆక్రమణలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. మా సొంత వాహనం కూడా ఇంటి నుంచి బయటకు తీసుకురాలేకపోతున్నాం. అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.

– వెంకటరెడ్డి, స్థానికుడు

కేంద్ర బడ్జెట్ నిరాశపరిచింది

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరాశను మిగిల్చిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ లేదని.. రాష్ట్రానికి మరోసారి మొండిచెయ్యే మిగిలిందని అభిప్రాయపడ్డారు. పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ పోర్టుకు బడ్జెట్‌లో కొంతమేర కేటాయింపులు చేసినా.. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఉన్న బిహార్ లాంటి రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, మిగతా రాష్ట్రాలపై వివక్ష చూపడం సరికాదని హితవు పలికారు. ఎన్డీఏలో టీడీపీ, జనతాదళ్ (యునైటెడ్) కీలకంగా వ్యవహరిస్తుండగా.. ప్రాజెక్టులు, బడ్జెట్ కేటాయింపులను రాబట్టుకోవడంలో బిహార్ సీఎం నితీష్ కుమార్ సక్సెస్ అయ్యారని మల్లాది విష్ణు తెలిపారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమవడంతో.. రాష్ట్రానికి మొండి చెయ్యే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్డీఏలో భాగస్వాములై రాష్ట్రానికి నిధులు రప్పించడంలో అటు చంద్రబాబు, ఇటు పవన్‌కల్యాణ్ విఫలమయ్యారని మల్లాది విష్ణు విమర్శించారు. ఏపీ అభివృద్ధికి కావలసిన నిధులపైనా కేంద్ర ఆర్థిక మంత్రి కనీసం ఎలాంటి హామీ ఇవ్వకపోవడం శోచనీయమని తెలిపారు. ప్రత్యేక హోదా ఊసే లేదని.. విభజన హామీల ప్రస్తావన లేకపోవడం రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చిందని పేర్కొన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. ఆంధ్ర ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని మల్లాది విష్ణు అభిప్రాయం వ్యక్తం చేశారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలు విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా సమావేశం శనివారం పాలప్రాజెక్టు సమీపంలోని వాల్మీకి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నమ్మి భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి మహిళా అధ్యక్షురాలు యలగాల నూకాలమ్మ ప్రసంగించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మంది సంఘంలో చేరగా, వారికి నేతలు కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. సదస్సులో వక్తలు మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా అందించాల్సి ఉన్నా, ఏ ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. బీసీ లందరూ ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, నగర అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, మరుపిళ్ళ తిరుమలేష్, నవిరి మహేష్, కంబాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలు, కళాకారులను సంరక్షించుకోవాలి



జానపద గాయకుడు డాక్టర్ దామోదర గణపతిరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: జానపద కళలు, కళాకారులను సంరక్షించుకోవాలని జానపద గీత శిల్పి బొండా జగన్మోహనరావు అన్నారు. జయహో జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం జానపద గీతాలు, జానపద కళాకారుడు డాక్టర్ దామోదర గణపతిరావు షష్టి పూర్తి సందర్భంగా ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. జగన్మోహనరావు మాట్లాడుతూ శ్రమైక జీవన గుండె చప్పుడు జానపద గీతాలు అని అభివర్ణించారు. కళాపోషకులు కేవీఆర్‌కే కిషోర్, మాసాబత్తుల శ్రీనివాస్, టి.శ్రీనివాసరెడ్డి, వీఆర్ బొబ్బా తదితరులు పాల్గొన్నారు. అతిథులు దామోదర గణపతిరావును ఆత్మీయంగా సత్కరించారు. గణపతిరావు పర్యవేక్షణలో గాయనీ గాయకులు పలు జానపద గీతాలు మధురంగా ఆలపించారు. నేలమ్మా నీరమ్మ నీకు వేనవేన దండాలమ్మా, అడవి దండాలో అడవి తల్లికి దండాలో తదితర గీతాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జానపద గాయనీ గాయకులు నూకతోటి శరత్‌బాబు,రంగం రాజేష్, ఉదయ భాస్కర్,పీవీ రమణ, దుబాయ్ నుంచి వచ్చిన కళాకారులు ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



గుణదల(విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు రెండవ రోజు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర లయోలా కళాశాల రెక్టర్ ఫాదర్ పూదోట రాయప్పజాన్ హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు ఆలయ గురువులు, మఠకన్యలు, కొవ్వొత్తులు చేతపట్టి జపమాల ధ్యానంతో కొండపై గల మేరీమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుని ఆరాధించారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ సునీల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలి



మాట్లాడుతున్న అన్నపురెడ్డి కోటిరెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు లక్ష్యసాధనకు నిర్దిష్ట ప్రణాళికతో పాటుపడాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. గాంధీజీ మహిళా కళాశాల, విజయవాడ కాన్వెంట్స్, స్కూల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని వివిధ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థినులకు శనివారం విద్యలో మంచి విజయాలను సాధించటం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ ఉంటే విజయానికి తొలిమెట్టు ఎక్కినట్టేనని చెప్పారు. నిర్దిష్టమైన ప్రణాళికతో శ్రమించినప్పుడు విజయాలు తప్పకుండా సాధించవచ్చన్నారు. ముఖ్యంగా విద్యార్థి జీవితంలో పదో తరగతి చాలా కీలకమన్నారు. ఈ దశలో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా శ్రమించి ముందుకు అడుగులు వేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అసోసియేషన్ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గాంధీజీ మహిళా కళాశాల అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమశేఖర్ నాయక్, అసోసియేషన్ ప్రముఖులు వై.బాబూరావు, షేక్ ఖాదర్‌బాషా, టి.దుర్గారావు, ఎన్వీ రావు, వై.ఆంజనేయరెడ్డి, టి.శ్రీనివాసరావు, సీహెచ్ హరనాథ్, కళాశాల ఉపాధ్యక్షుడు కె.వెంకటపిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

4న రథసప్తమి వేడుకలు



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీ మంగళవారం వన్‌టౌన్‌లోని ఎంఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ శనివారం తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. టీటీడీ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తోందన్నారు. ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఉదయం తొమ్మిది గంటలకు వేదపండితులతో సూర్యారాధన, యోగా అధ్యాపకుడు ఉపద్రష్ట సూరి నిర్వహణలో విద్యార్థినీ విద్యార్థినులు సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ కమిటీ సభ్యులు బొగ్గవరపు రాధాకృష్ణ, బొమ్మారెడ్డి సుధాకరరెడ్డి, నండూరి వెంకట తాండవ కృష్ణ, టీటీడీ కల్యాణమండపం మేనేజర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు. అతిథులు బ్యానర్ ఆవిష్కరించారు.

బొండా ఉమా ప్రీమియర్ లీగ్‌లో ఉద్రిక్తం!

ఇరు జట్ల సభ్యుల ఘర్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న బొండా ఉమా ప్రీమియర్ లీగ్‌లో శనివారం ఉద్రిక్తత నెలకొంది. ఈనెల 27వ తేదీ నుంచి ఇక్కడ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. పలు ప్రైవేటు క్రికెట్ టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయి. క్రికెట్ స్కోర్ విషయంలో ఇరుజట్ల సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో జట్టు సభ్యులు ఒకరిపై మరొకరు బాహాబాహీకి దిగారు. మాచవరం ప్రాంతానికి చెందిన నేరచరిత్ర కలిగిన వ్యక్తి దాడికి పాల్పడటంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కళాశాల క్రీడా మైదానం ఇరు జట్ల సభ్యుల అరుపులు, కేకలతో దద్దరిల్లింది. దీనిపై సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకోవడంతో ఇరుజట్ల సభ్యులు ఉడాయించారు. ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో రాజకీయ నేతల పేరిట ఏర్పాటు చేసిన క్రీడలకు అనుమతి ఎలా ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల మేరకు కళాశాల క్రీడాకారులు మాత్రమే వినియోగించుకోవాల్సిన క్రీడామైదానంను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ ఒత్తిడితోనే కళాశాల సిబ్బంది క్రికెట్ టోర్నీకి అనధికారికంగా అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే వారివారి రంగాల్లో రాణిస్తారని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో 'జిజ్ఞాస –2025' పేరుతో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంను శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అమర్‌సుధీర్ మాట్లాడుతూ నూతన సాంకేతికతతో ఆధునికతను సంతరించుకున్న ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ రంగాల్లో అగ్రగామిగా నిలవాలంటే నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు ముందుకు అడుగులు వేయాలని సూచించారు. తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ వివిధ పోటీలకు దేశ వ్యాపితంగా 1063 మంది విద్యార్థులు హాజరవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్లాక్‌బాక్స్, టెక్‌ప్రింట్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడ్‌మానియా, ఇన్‌స్టా రీల్స్, పోస్టర్ ప్రెజెంటేషన్, టెక్ అన్వేష తదితర అంశాలపై పోటీలను నిర్వహించారు.

పోటీల విజేతలకు సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, గ్రంధి సందీప్, సహాయ కార్యదర్శి జి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్, విభాగాధిపతి డాక్టర్ డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల మరమ్మతులు

నున్న(విజయవాడరూరల్): ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న–గుడివాడ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం (ఫిబ్రవరి 1) నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు జరుగుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కోటేశ్వరరావు, ఓఅండ్ఎం నున్న ఒక ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తారని పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారని ఆయన వివరించారు.

నగరంలో జలకన్యల విహారం



నగరంలో జలకన్యల ఎగ్జిబిషన్ నగర ప్రజలకు వినోద కేంద్రంగా మారింది. విద్యాధరపురం సితార జంక్షన్ సమీపంలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో నీటిలో ఈత కొట్టే జలకన్యలు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నారు. ఫిలిప్పైన్స్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన ఈ యువతులు 10 అడుగుల లోతు ఉన్న రెండు అద్దాల వాటర్ ట్యాంకుల్లో ఈత కొడుతూ బయట ఉన్న చిన్నారులకు ఫ్లయింగ్ కిస్‌లు విసురుతుంటే జనం ఫిదా అయిపోయి ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. రెండు కాళ్లకు దిగువన చేప ఆకారంలో ఉండే వస్త్రాలు ధరించి అచ్చం కథల్లో చెప్పే జలకన్యల్లా ఉన్న వీరి ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. ప్రవేశ టికెట్ ధర రూ.120.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మైలవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా సంయుక్త సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చన్నారు. యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. మదన్‌మోహన్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ప్రోగ్రాం ఇన్‌చార్జి ఎస్. ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన పెంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): లెప్రసీ, క్షయ(టీబీ) వ్యాధుల లక్షణాలు, నివారణ, చికిత్స వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100 రోజులు క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమం, స్పర్శ లెప్రసీ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా జైలులో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ ఉషారాణి ఆయా వ్యాధులపై జైలులో ఉన్న నిందితులకు, జైలు సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ హంసాపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.